పురంలో సమస్యల తిష్ట

- డ్రైనేజీ వ్యవస్థ నిర్వీర్యం
- వేధిస్తున్న నీటి సమస్య
- ఆందోళనలో ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ చైర్మన్


హిందూపురం పట్టణంలో పేరుకుపోయిన చెత్తా చెదారం

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలో పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. ఎటు చూసినా సమస్యలు చుట్టుముట్టాయి. పాలకులు, అధికారులు మాటలకే పరిమితమయ్యారు. ఏ వార్డులో చూసినా డ్రైనేజీలు అధ్వానంగా మారాయి. రహదారులు గుంతలమయంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా తాగునీటి సమస్యలతో పట్టణ ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇదెక్కడి పరిపాలన అంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అధికారంపై ఉండే మోజు మున్సిపల్ చైర్మన్ డీఏ రమేష్‌కు సమస్యల పరిష్కారంపై లేకపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లివెత్తుతున్నాయి. ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏల కనుసన్నల్లో మొత్తం వ్యవహారం ఉండటంతో ప్రజా సమస్యలను పట్టించుకునే తీరిక కూడా లేకపోయిందంటూ మండిపడుతున్నారు.

డ్రైనేజీ వ్యవస్థ నిర్వీర్యం

పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైంది. ఏ వార్డులో చూసినా మురుగునీరు దర్శనమిస్తోంది. దీంతో నివాసితులు ఇబ్బందులకు గురౌతున్నారు. మున్సిపాలిటీ అధికారులు, యంత్రాంగం పారిశుధ్యంపై కన్నెత్తి చూడకపోవడంతో అధ్వానంగా మారిపోయింది. వేసవి నేపథ్యంలో ఈగలు, దోమల బెడద తీవ్రంగా ఉంది.ముక్కిడి పేట, డీఎల్ రోడ్డు, వీడీ రోడ్డు, ఆర్‌పీజీటీ రోడ్డు వంటి చోట్ల డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు కుప్పలు తెప్పలుగా వేస్తుండటం, వాటిని తొలగించకపోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది.పట్టణంలోని లక్ష్మీ టాకీస్ సమీపంలో డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నా.. ఎవరూ తొలగించడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పట్టణంలో చెత్త ఎక్కడపడితే అక్కడే వదిలేస్తున్నారు. దీంతో ఈగలు, దోమల బెడద, దుర్వాసన ఎక్కువగా ఉంటోంది. కుళ్లిన కూరగాయలు, వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ వేస్తుండటంతో పశువులూ అనారోగ్యానికి గురవుతున్నాయి.

నీటి ఇక్కట్లు

పట్టణంలో ఎక్కడ చూసినా నీటి సమస్య హెచ్చుమీరిపోయింది. నీటి కోసం మహిళలు నానా అవస్థలు పడుతున్నారు. మున్సిపాలిటీ అధికారులు సమస్య రాకుండా చేస్తున్నాం అని చెబుతున్నారే కానీ నీటి సమస్యకు చెక్ పెట్టడంలో విఫలం చెందారు. ప్రధానమైన నీటి సమస్యను పరిష్కరించకపోతే ప్రజలు ఎలా జీవనం సాగించాలో చైర్మన్, మున్సిపల్ అధికారులు సమాధానం చెప్పాలని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, నేతలు ప్రశ్నిస్తున్నారు.


లక్ష్మీ టాకీస్ వద్ద డ్రైనేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు

రైల్వే రోడ్డు నిర్మాణం ఎప్పుడు..?



పట్టణంలోని 70 ఫీట్ రైల్వే రోడ్డు నిర్మాణం ఎప్పుడు చేపడతారు..? ఎప్పుడూ ఏదో ఒక కారణంతో ఆలస్యం చేస్తూనే ఉన్నారు. ఎవరికో ప్రయోజనం చేకూర్చడానికి రోడ్డు నిర్మాణం పనులు ఆపేశారా..? రోడ్డు ఆక్రమించుకుని చేపట్టిన కొన్ని భవంతులను తొలగించకుండా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

– అసిఫుల్లా, వైఎస్సార్‌సీపీ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్

నీటి కోసం అవస్థలు



నీటి కోసం నానా అవస్థలు పడుతున్నాం. ప్రధానమైన సమస్యగా మారింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు నిద్రమత్తులో ఉన్నారు. మా గురించి ఎవ్వరు పట్టించుకునేవారే లేరు. ఒక ఏరియాలో నీళ్లొదులుతారు. మరొకచోట వదలరు. ఎన్నాళ్లీ మాకీ సమస్యలు.

– హరగోపాల్‌రెడ్డి, సడ్లపల్లి

అధికారులు పట్టించుకోవడం లేదు



మా ఏరియాలో నీటి సమస్య అధికంగా ఉంది. రెండు రోజులకొకసారి కూడా నీళ్లు రావడం లేదు. దీంతో ట్యాంకర్లు ద్వారా నీరు తెప్పించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. డ్రైనేజీ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. మున్సిపల్ చైర్మన్, కమిషనర్ స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలి.

– కవిత, మేళాపురం

బీసీల సమరభేరి జయప్రదం చేయండి


మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు

హిందూపురం: జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఈ నెల 11న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న బీసీల సమరభేరి కార్యక్రమాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు విజయవంతం చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి, రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ శ్రీరాములు కోరారు. బహుజన సమాజ్ పార్టీ హిందూపురం శాఖ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలని, బీసీల కులగణన నిష్పక్షపాతంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అన్ని పార్టీలు కేవలం బీసీలను ఓటర్లుగా మాత్రమే చూస్తున్నారని, రాజ్యాధికారంలోకి రానివ్వడంలేదన్నారు. వీటి సాధనకు బీసీలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కోశాధికారి హరికుమార్, నాయకులు పెన్నాయ్య, శ్రీనివాసులు, ఈశ్వరయ్య, సుబ్బరాయప్ప, కొండప్ప, కొట్నూర్ గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

నాగలమడక ఆలయ జీర్ణోద్ధరణకు చర్యలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

పావగడ: నాగలమడక అంత్య సుబ్రహ్మణ్య స్వామి ఆలయ జీర్ణోద్ధరణకు చర్యలు తీసుకుంటాం. త్వరలో దేవదాయ శాఖామంత్రి రామలింగారెడ్డి చేతుల మీదుగా ఆలయ అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తామని ఎమ్మెల్యే, తుముల్ అధ్యక్షుడు హెచ్.వి వెంకటేశ్ తెలిపారు. కుక్కె, ఘాటి సుబ్రహ్మణ్యం స్వామి దేవాలయాల మాదిరిగా అంత్య సుబ్రహ్మణ్య స్వామి ఆలయాన్ని కూడా అభివృద్ధి చేస్తామన్నారు. అంతే కాకుండా నాగలమడక గ్రామంలో కళ్యాణ మంటపం నిర్మిస్తామని వెల్లడించారు. నాగలమడక పంచాయతీ తిమ్మమ్మనహళ్లి గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కోరమాండల్ ఎరువుల కంపెనీ ఆధ్వర్యంలో నిర్మించిన రక్షిత తాగునీటి ప్లాంట్‌ను ప్రారంభించారు. కోరమాండల్ ఎరువుల కంపెనీ విద్యార్థులకు స్వచ్ఛమైన తాగు నీరు అందించేందుకు ఆర్వో ప్లాంట్ నిర్మించడం అభినందనీయమని కొనియాడారు. మే నెలలో సీఎం సిద్ధరామయ్య చేతుల మీదుగా తుంభద్ర తాగు నీటి పథకాన్ని ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ పురుషోత్తమ రెడ్డి, వీఎస్‌ఎస్‌ఎన్ అధ్యక్షుడు పాలనాయక్, ఆర్టీఓ హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా చింత చెట్ల నరికివేత

రొళ్ల: మండల పరిధిలోని జీఎస్ పాళ్యంలో గ్రామంలో అదే గ్రామానికి చెందిన దాసప్ప అనే రైతు అధికారుల నుంచి ఎలాంటి అనుమతి లేకుండా చింత చెట్లను నరికివేశాడు. విషయం తెలుసుకున్న అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ కుళ్లాయప్ప, బీట్ ఆఫీసర్ విజయకుమార్, వీఆర్వో రంగనాథ్ తదితరులు క్షేత్రస్థాయిలో చెట్లను పరిశీలించారు. అనుమతి లేకుండా చెట్లను ఎలా నరికారని ప్రశ్నించారు. తనకు కోర్టు ఆదేశాలు ఉన్నాయని రైతు తెలపడంతో చూపించాలని అధికారులు ఆదేశించారు. ఇంటికి వెళ్లి తెస్తానని చెప్పిన దాసప్ప.. అక్కడి నుంచి తన ద్విచక్ర వాహనంలో పరారయ్యాడు. గ్రామాల్లో రైతులు తమ పొలంలో ఉన్న చెట్లను తొలగించుకోవాలంటే తప్పని సరిగా అటవీశాఖ అధికారుల అనుమతి తీసుకోవాలని తెలిపారు. లేకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు.

శ్రీరామనవమికి ఆలయాల ముస్తాబు


విద్యుత్ దీపాలంకరణలో సూగూరు దేవస్థానం

హిందూపురం: శ్రీరామనవమి పండుగను పురస్కరించుని సూగూరు ఆంజనేయస్వామి ఆలయం ప్రాగంణమంతా విద్యుత్ దీపాలంరణలో వెలుగు నింపుకుంది. నవమి సందర్భంగా ఆలయంలో సీతారామ కల్యాణం, రథోత్సవం, ఉట్లపరుష, లంకాదహనం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ అధికారులు, ఇతర శాఖాధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. అలాగే సాయంత్రం ఐదు గంటలకు ఆలయ ప్రాంగణంలో ఆర్‌కే రెస్లింగ్ అకాడమీ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సహకారంతో ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయి మట్టి కుస్తీ పోటీల కార్యక్రమం ఉంటుందని అకాడమీ ఇంటర్నేషనల్ ప్లేయర్ రమేష్ తెలిపారు. పోటీల్లో అనంతపురం, సత్య సాయి జిల్లా క్రీడాకారులు పాల్గొంటారన్నారు. శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని ఆలయం వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు సీఐ అబ్దుల్‌కరీం తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల కల్యాణం

అమరాపురం: మండల కేంద్రంలోని లక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం సీతారాముల కల్యాణం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే వినాయక మంటపంలో శ్రీరామ నవమి, తమ్మడేపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు.

పెద్దాంజనేయస్వామి ఆలయంలో వేడుకలు

రొద్దం: మండల కేంద్రంలోని పెద్దాంజనేయస్వామి ఆలయంలో అర్చకులు గిరీష్‌స్వామి ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించనున్నట్లు శ్రీరామ భక్త మండల సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం గ్రామ దేవత రొద్దకాంబదేవి ఉత్సవ విగ్రహం ఊరేగిపు ఉంటుందన్నారు.

ఎలుగు బంట్లతో అప్రమత్తంగా ఉండండి

పావగడ: ఎలుగు బంట్లతో అప్రమత్తంగా ఉండాలని స్థానిక అటవీ శాఖ ఆర్ఎఫ్ఓ రాకేశ్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విశ్వ ఎలుగు బంట్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలు, రైతులు సాయంత్రం, రాత్రి వేళల్లో పొలాల్లోకి ఒంటరిగా వెళ్లరాదని సూచించారు. ఎలుగు బంట్లు వచ్చినప్పుడు చెట్లు ఎక్కాలని తెలిపారు. రాత్రి పూట పొలాల్లో మంటలు వేసుకోవాలన్నారు. పడుకునే ముందు తలకు తువ్వాలు చుట్టుకుని పడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

తుమ్మల మారెమ్మ జాతరకు ఆహ్వానం


ఈరలక్కప్పకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

గుడిబండ: తుమ్మల మారెమ్మ జాతర ఈనెల 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ వైభవంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు. శనివారం ఫళారం గ్రామానికి వెళ్లి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్పకు ఆహ్వాన పత్రిక అందజేసి, జాతరకు ఆహ్వానించారు.

ఘనంగా జగ్జీవన్‌రాం జయంతి


మడకశిరలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప


హిందూపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న వేణురెడ్డి


పెనుకొండలో క్యాంప్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మంత్రి సవిత

చిలమత్తూరు/మడకశిర/అమరాపురం/లేపాక్షి/పెనుకొండ/పెనుకొండ రూరల్/సోమందేపల్లి/మడకశిర రూరల్/అగళి/రొళ్ల/పావగడ: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ ఆదర్శ ప్రాయుడని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి అన్నారు. శనివారం హిందూపురం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బాబూ జగజ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ శివ, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు మహేష్ గౌడ్, కౌన్సిలర్లు మల్లికార్జున, ఆసిఫుల్లా, నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, రామూర్తి, శ్రీరాములు, నరసింహులు ,సూర్య మోహన్, బాబుల్లి, అయూబ్ బైగ్, ఇనాయత్, నవీన్, చందు,బాబా హరి, నారాయణ పాల్గొన్నారు.

• మడకశిర పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉప ప్రధానిగా జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు వెలకట్టలేనివని తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనంద రంగారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, కుంచిటి వక్కలిగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రంగేగౌడ్, మండల కన్వీనర్ రామిరెడ్డి, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి సత్యనారాయణ, సర్పంచ్ తిప్పన్న, ఎంపీటీసీ రామచంద్రప్ప, ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షుడు వసీంబేగ్ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

• పెనుకొండ పట్టణంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిపారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత తన క్యాంపు కార్యాలయంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అలాగే సీపీఎం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అలాగే దళిత సంఘాల నాయకులు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఎంఎస్ మూర్తి, ఎనుమల రామకృష్ణ, పెద్దన్న, రామాంజనేయులు, ఎంఈఎఫ్ నాయకులు శ్రీనివాసులు, గోవిందు, కౌన్సిలర్ శేషాద్రి, మారుతి పాల్గొన్నారు.

వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో..

మడకశిర మండల పరిధిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సరోజినీదేవి ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అట్టడుగువర్గాల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని మరువలేనిదన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా నివాళులు

అలాగే సోమందేపల్లి, అగళి, అమరాపురం, లేపాక్షి, పావగడలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి దళిత సంఘాల నాయకులు నివాళులర్పించారు. అణగారిన హక్కుల సాధన కోసం ఆయన పోరాడారని వారు పేర్కొన్నారు.

క్లుప్తంగా

పులమతి ఆంజనేయస్వామికి జ్యోతులు


అలంకరణలో ఆంజనేయుడు

లేపాక్షి: మండలంలోని పులమతి గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి గ్రామస్తులు శనివారం ఉదయం జ్యోతులు సమర్పించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి జ్యోతిని మోసుకుంటూ ఊరి వాకిలి వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి జ్యోతులను స్వామి వారికి అర్పించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేషంగా పూజలు చేశారు. ముందుగా గంగపూజ, కలశ స్థాపన, రక్షాబంధన, మహామంగళారతి కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా రాత్రికి సీతారాముల కల్యాణోత్సవం, చెక్క భజన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ అశ్వత్థనారాయణ, నాయకులు ప్రభాకర్‌రావు, శ్రీనివాసరెడ్డి, నరసింహప్ప, తిమ్మారెడ్డి, రాంప్రసాద్, రామాంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడి మృతి


మృతదేహానికి నివాళులర్పిస్తున్న వాగేష్, ఈరన్న

అమరాపురం: మండల పరిధిలోని వి.అగ్రహారం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రంగస్వామి అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, ఎంపీపీ ఈరన్న, సర్పంచులు గోవిందప్ప, గుండప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈరన్న, భీరలింగప్ప, తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రంగస్వామి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని మృతుడి భార్య విజయమ్మ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

జూదరుల అరెస్ట్

చిలమత్తూరు: మండలంలోని సంజీవరాయునిపల్లి వద్ద పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.10,350 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు. మరో ఎనిమిది మంది పరారయ్యారన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లులతో ముస్లింలకు అన్యాయం

పెనుకొండ: వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింలకు అన్యాయమేనని, మైనార్టీలు తమ హక్కులు కోల్పోవాల్సి ఉంటుందని పట్టణ ఆవాజ్ కమిటీ అధ్యక్షులు మహబూబ్‌బాషా అన్నారు. శనివారం ఆవాజ్ కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు మహబూబ్‌బాషా మాట్లాడుతూ ప్రతిపక్షాల వ్యతిరేకత నడుమ వక్ఫ్ చట్టానికి లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదం లభించిందని , దీంతో మైనార్టీల హక్కులు కాలరాసినట్లయ్యిందన్నారు. సమావేశంలో కమిటీ నాయకులు హబీబ్, బాబావలి, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించి రాయితీ పొందండి

మడకశిర: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఆస్తి పన్నును సకాలంలో చెల్లించి రాయితీ పొందాలని కమిషనర్ రంగస్వామి ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 30లోగా ఆస్తి పన్ను చెల్లించి 5 శాతం రాయితీ పొందాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

పెనుకొండ: విద్యార్థులు ఇష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సత్యసాయి డిగ్రీ కళాశాలలో ఫేర్‌వెల్‌డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లో ఉందన్నారు. విలువలు, నైపుణ్యాలను విద్యార్థులు పెంపొందించుకోవాలన్నారు. సమావేశంలో విశ్రాంత ఉపాధ్యాయులు షమీవుల్లా, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి, ఏట కేశవయ్య, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువ పరిశీలన

సోమందేపల్లి: మండల కేంద్రంలోని నక్కల గుట్టకాలనీ వద్ద హంద్రీనీవా కాలువను మంత్రి సవిత శనివారం పరిశీలించారు. ఇటీవల కాలువకు గండి పడి నీరు వృథా అయ్యింది. దీంతో హంద్రీనీవా అధికారులు మరమ్మతులు చేయిస్తున్నారు. దీంతో మంత్రి కాలువను సందర్శించి పనులు నాణ్యత ఉండేలా చేయాలని సూచించారు.



ఉష్ణోగ్రత సమాచారం

హిందుపురం	34.0
పెనుకొండ	36 .0
మడకశిర	34.0

శ్రీరామనవమి శుభాకాంక్షలు


టీఎన్ దీపిక

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక నియోజకవర్గ ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ హిందువులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగల్లో శ్రీరామనవమి ఒకటని, ఆ రాముడి ఆశీస్సులతో పండుగను కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్టు తెలిపారు.

నేడు గంధం వేడుకలు


పెనుకొండ సమీపంలోని ఖ్రముద్దీన్ అలీ దర్గా

పెనుకొండ: పట్టణంలోని గోనిపేట రహదారిలోని ఖ్రముద్దీన్ అలీ దర్గాలో గంధం వేడుకలు ఆదివారం జరుగుతాయని దర్గా నిర్వాహకులు ఖలీముల్లా తెలిపారు. ఖ్రముద్దీన్ లలీ బాబా దర్గాలో ఏటా స్వామికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం ఆనవాయితీ. మధ్యాహ్నం 1 గంట అనంతరం గంధం వేడుకలు నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ఏపీ, తెలంగాణా, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ముంబై నుంచి పెద్దఎత్తున భక్తులు తరలిరానున్నారు. దర్గాను నిర్వాహకులు సుందరంగా తీర్చిదిద్దారు. శనివారం రాత్రి భక్తి కార్యక్రమాలు నిర్వహించారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

హిందూపురం: హిందూపురం పరిసర ప్రాంతాల ప్రజలకు శనివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కడప పుష్పగిరి కంటి ఆస్పత్రి వారి వైద్య బృందంచే 68 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 25 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరిని కడప పుష్పగిరి హాస్పిటల్‌కు తీసుకువెళ్లి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసి రవాణా, వసతి, భోజన వసతి సదుపాయం కల్పించి తిరిగి హిందూపురానికి తీసుకువస్తామని క్లబ్ అధ్యక్షుడు నాగరాజరెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ప్రతి నెలా ఉచితంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి కృషి


అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని తిరుమణి వీఎస్ఎస్ఎన్ సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు శనివారం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి పి.వరద రెడ్డి, ఉపాధ్యక్ష స్థానానికి ఎస్.ఆదినారాయణ మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. ఆ స్థానాలకు ఇంకెవ్వరు నామినేషన్లు దాఖలు చేయక పోవడంతో అధ్యక్షుడిగా పి.వరద రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎస్.ఆదినారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సి.వెంకటేశ్ అధికారికంగా ప్రకటించారు. అనంతరం నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఘనంగా సన్మానించారు. వీఎస్ఎస్ఎన్ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని అధ్యక్షుడు వరద రెడ్డి తెలిపారు.

కేబుల్ చోరీ

గుడిబండ: తాళ్లకెర గ్రామ పంచాయతీ గొల్లహట్టి చెరువు వద్ద తాగునీటి బోరుబావికి అమర్చిన 200 మీటర్ల కేబుల్‌ను గుర్తు తెలియని వ్యక్తు చోరీ చేసినట్లు సర్పంచ్ రంగస్వామి తెలిపారు. దుండగులపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశామని పేర్కొన్నారు.

ధరల పెంపుపై ఆందోళన

పావగడ: నిత్యావసర వస్తువుల ధరలు అమాంతంగా పెంచి సామాన్య ప్రజల కడుపు కొట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నేత డా వెంకట్రామయ్య మాట్లాడుతూ.. నిత్యావసర సరుకులు, పాలు, విద్యుత్, రవాణా, డీజిల్, రెవెన్యూ ఈ–స్టాంప్ ధరలు అధికంగా పెంచడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకుడు రవి మాట్లాడుతూ.. ముస్లింలకు ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో 4 శాతం ధర్మ ఆధారంగా రిజర్వేషన్ జారీ చేసిన కర్ణాటక ప్రభుత్వం రాజ్యాంగం, హిందూ మతం విరోధి అని దుయ్య బట్టారు. ధరలు తగ్గించకుంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం స్థానిక ఉప తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.